# ఓటు.. సామాన్యుని బ్రహ్మాస్త్రం

● ఘనంగా జాతీయ ఓటర్ల దినోత్సవం



ప్రతిజ్ఞ చేస్తున్న దృశ్యం

ఆళ్లగడ్డ: ప్రజాస్వామ్యంలో సామాన్యుని చేతిలో ఓటు బ్రహ్మాస్త్రమని, దానిని మంచి పాలకులను ఎన్నుకునేందుకు ఉపయోగించాలని ఆళ్లగడ్డ నియోజకవర్గ ఎన్నికల ఉప తహసీల్దార్ బ్రహ్మయ్య అన్నారు. జాతీయ ఓటర్ల దినోత్సవ కార్యక్రమాన్ని శనివారం ఘనంగా నిర్వహించారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయం ఆవరణ నుంచి నాలుగు రోడ్ల కూడలి వరకు ర్యాలీ చేపట్టారు. అక్కడ ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ 18 ఏళ్లు నిండిన ప్రతి ఒక్కరూ ఓటు హక్కు కలిగి ఉండాలన్నారు. ఉత్తమ బీఎల్ఓలకు బహుమతులు అందజేసి అభినందించారు. అనంతరం నిర్భయంగా ఓటు వేస్తామని ఓటర్లతో ప్రతిజ్ఞ చేయించారు.

**బంగారు భవిష్యత్‌కు ఓటే పునాది**

దొర్నిపాడు: ఓటు బంగారు భవిష్యత్‌కు పునాదిలాంటిదని ఎంపీడీఓ సావిత్రి, డిప్యూటీ తహసీల్దార్ మాధవ అన్నారు. శనివారం జాతీయ ఓటర్ల దినోత్సవాన్ని పురస్కరించుకుని స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో బీఎల్ఓలు, వీర్ఓలతో కలిసి ప్రతిజ్ఞ చేయించారు. ఈసందర్భంగా 18 ఏళ్లు నిండిన వారు ఓటు హక్కుకు దరఖాస్తు చేసుకోవాలన్నారు. ఎన్నికల వేళల్లో ఓటు ఉన్న ప్రతి ఒక్కరూ తమ హక్కును వినియోగించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో పరిపాలనాధికారి నారాయణమూర్తి పాల్గొన్నారు.

**ఓటు హక్కును సద్వినియోగం చేసుకోవాలి**

ఉయ్యాలవాడ: ఓటు భారత రాజ్యాంగం కల్పించిన హక్కు, ఓటు హక్కును యువత వదులుకోవద్దని సద్వినియోగం చేసుకోవాలని రెవెన్యూ ఆర్ఐ అంకన్న సూచించారు. శనివారం జాతీయ ఓటర్ల దినోత్సవాన్ని పురస్కరించుకుని స్థానిక రెవెన్యూ కార్యాలయం వద్ద ఓటర్లు, సిబ్బందితో కలిసి రెవెన్యూ అధికారులు ప్రతిజ్ఞ చేశారు. కార్యక్రమంలో జూనియర్ అసిస్టెంట్ వెంకటేశ్వరరెడ్డి పాల్గొన్నారు.

**ఓటే వజ్రాయుధం**

శిరివెళ్ల: జాతీయ ఓటరు దినోత్సవాన్ని పురస్కరించుకుని వీఆర్వోలు, సిబ్బందితో కలిసి తహసీల్దార్ పుష్పకుమారి ర్యాలీ నిర్వహించారు. ఓటు హక్కుపై ప్రతిజ్ఞ చేశారు. కార్యక్రమంలో డీటీ కిశోర్ కుమార్, మండల సర్వేయర్ చిన్న మల్లయ్య పాల్గొన్నారు.


దొర్నిపాడు ఎంపీడీఓ కార్యాలయంలో ప్రతిజ్ఞ చేస్తున్న అధికారులు

**ఓటు విలువ తెలుసుకోండి**

రుద్రవరం: సమాజంలో ప్రతి ఒక్కరూ ఓటు విలువ తెలుసుకోవాలని తహసీల్దారు మల్లికార్జునరావు సూచించారు. స్థానిక రెవెన్యూ కార్యాలయం వద్ద శనివారం జాతీయ ఓటరు దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సమాజంలో ఓటు కీలకమైనదని, అలాంటి ఓటును మంచి మార్గం వైపు నడిచే వారిని గెలిపించేందుకు మాత్రమే వినియోగించాలని సూచించారు.

## పథకాల అమలులో ప్రభుత్వం విఫలం

నంద్యాల(అర్బన్):సంక్షేమ పథకాల అమలులో కూటమి ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని పీసీసీ రాష్ట్ర మాజీ ప్రధాన కార్యదర్శి చింతల మోహన్‌రావు విమర్శించారు. స్థానిక కార్యాలయంలో శనివారం ఏర్పాటు చేసిన ముఖ్య నాయకుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఎన్నికల్లో ఇచ్చిన హామీల అమలులో ప్రభుత్వం కప్పదాటు ధోరణిని అవలంభిస్తుందన్నారు. సూపర్–6 పథకాలు అంటూ రాష్ట్ర ప్రజలను ఊదరగొట్టిన కూటమి నాయకులు అధికారంలోకి వచ్చిన తర్వాత వాటి ప్రస్తావనను మరిచారన్నారు. పార్టీ పట్టణ అధ్యక్షుడు చింతలయ్య, నియోజకవర్గ ఇన్‌చార్జ్ పుల్లయ్య, మస్తాన్, ఊకొట్టువాసు, సలాం పాల్గొన్నారు.

## టెన్నిస్ పోటీలు

నంద్యాల(న్యూటౌన్): రిపబ్లిక్‌డే సందర్భంగా నంద్యాల కాస్మో పాలిటన్ క్లబ్ ఆధ్వర్యంలో శనివారం సాయంత్రం నంద్యాల టెన్నిస్ అసోసియేషన్ ఆధ్వర్యంలో టెన్నిస్ డబుల్స్ పోటీలు నిర్వహించారు. పోటీలను సీనియర్ టెన్నిస్ క్రీడాకారులు మల్లు రామచంద్రారెడ్డి, డాక్టర్ గిరిన్నాథ్ ప్రారంభించారు. వారు మాట్లాడుతూ రిపబ్లిక్ డే సందర్భంగా పోటీలు నిర్వహించడం సంతోషకరమన్నారు. పోటీల్లో 26మంది క్రీడాకారులు పాల్గొనగా విజేతలుగా డాక్టర్ శరత్‌చంద్ర, గోగి, రన్నర్స్‌గా ప్రభంజన్‌రెడ్డి, మురళీ నిలిచినట్లు చెప్పారు.

## క్లుప్తంగా

### వేంకటేశ్వరస్వామికి విశేష పూజలు


కుంకుమార్చన పూజల్లో పాల్గొన్న భక్తులు

రుద్రవరం: మండల పరిధిలోని కొండమాయపల్లె పంచాయతీ వెళగలపల్లె పొలిమేరలో వెలసిన లక్ష్మీ, గోదా సమేత వాసాపురం వేంకటేశ్వరస్వామికి శనివారం భక్తులు విశేష పూజలు నిర్వహించారు.ఆలయ నిర్వాహకుల ఆధ్వర్యంలో అర్చకులు ఉదయాన్నే స్వామి అమ్మవార్లకు నిత్య పూజలు చేశారు. అనంతరం పట్టు వస్త్రాలు, పూలమాలలతో ప్రత్యేకంగా అలంకరించి భక్తులకు దర్శణం కల్పించారు. స్థానికుల నుంచి వివిధ ప్రాంతాల నుంచి అధిక సంఖ్యలో తరలివచ్చిన భక్తాదులు ప్రత్యేక పూజలు చేసి తమ మొక్కులు తీర్చుకున్నారు. అనంతరం స్వామి అ మ్మవార్ల సన్నిధిన కుంకుమార్చన పూజలు చేశారు.

### ప్రత్యేక పూజలు


ఆలయంలో పూజలు చేస్తున్న భక్తులు

ఉయ్యాలవాడ: మండలంలోని ఆర్.జంబులదిన్నె, ఉయ్యాలవాడ, సుద్దమల్ల, ఇంజేడు గ్రామాల్లో శనివారం భక్తులు ఉదయాన్నే ఆలయాలకు చేరుకుని పూజలు చేశారు. అభయాంజనేయస్వామి, లక్ష్మీనరసింహ కంబగిరిస్వామి, లక్ష్మీవేంకటేశ్వరస్వామికి అభిషేకాలు, ఆకుపూజ, కుంకుమార్చన, ప్రత్యేక పూజలు నిర్వహించారు. అర్చకులు లక్ష్మణస్వామి, భాస్కరశర్మ, కమలేష్‌శర్మ, అనంతయ్య భక్తులకు తీర్థ ప్రసాదాలు అందజేశారు.

### జయప్రదం చేయండి

నంద్యాల(న్యూటౌన్): ఈనెల 26వ తేదీన నంద్యాలలో జరిగే రైతు, కార్మికుల బైక్ ర్యాలీని జయప్రదం చేయాలని ఏఐటీయూసీ పట్టణ కార్యదర్శి శ్రీనివాసులు కోరారు. శనివారం స్థానిక సీపీఐ కార్యాలయంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు రైతు, కార్మిక ప్రజా వ్యతిరేక విధానాలను అవలంభిస్తున్నాయని విమర్శించారు. నాలుగు లేబర్ కోడ్‌లను రద్దు చేసి ఏప్రిల్ నుంచి అమలు చేస్తున్న లేబర్ కోడ్‌లను నిలిపి వేయాలని డిమాండ్ చేశారు. కార్యాలయం నుంచి పట్టణంలో ర్యాలీ చేపడుతున్నట్లు తెలిపారు. ప్రజా సంఘాలు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

### ఓబీసీ జిల్లా కన్వీనర్‌గా శ్రీనివాసులు



ఆళ్లగడ్డ: ఓబీసీ జిల్లా కన్వీనర్‌గా డాక్టర్ ఈపనగండ్ల శ్రీనివాసులును నియమించారు. రాష్ట్ర అధ్యక్షుడు వరప్రసాద్ గుంటూరులో జరిగిన రాష్ట్ర సమావేశంలో జిల్లాకు ఓబీసీ కన్వీనర్‌గా తనను నియమించారని శ్రీనివాసులు తెలిపారు. రాజ్యాధికారం దిశగా బహుజనులను ఏకం చేసేందుకు కృషి చేస్తానన్నారు.

### పశువులను పరిశుభ్రంగా ఉంచాలి


దూడలకు నట్టల నివారణ మందును తాపుతున్న పశువైద్యాధికారి

దొర్నిపాడు: పాడిపెంపకం దారులు పశువులను పరిశుభ్రంగా ఉంచుకోవాలని పశువైద్యాధికారి కేవీఆర్ పుల్లయ్య సూచించారు. శనివారం మండలంలోని డబ్ల్యూ కొత్తపల్లెలో పశువైద్యశిబిరం నిర్వహించారు. 45 పశువులకు వైద్యచికిత్సలు నిర్వహించారు. 34 ఆవులు, గేదెలకు నట్టల నివారణ మందులను తాపించారు. కార్యక్రమంలో జూనియర్ వెటర్నరీ ఆఫీసర్ రమణయ్య పాల్గొన్నారు.

### ఆధార్ క్యాంపులను సద్వినియోగం చేసుకోండి

ఉయ్యాలవాడ: మండలంలో ఈనెల 27వ తేదీ నుంచి నిర్వహించే ప్రత్యేక మొబైల్ ఆధార్ కేంద్రాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఎంపీడీఓ ఉమామహేశ్వరరావు శనివారం తెలిపారు. ఈ నెల 27, 28వ తేదీన మాయలూరు, 29, 30 తేదీలలో అల్లూరు గ్రామ సచివాలయాల్లో క్యాంపులు ఉంటాయన్నారు. కొత్తగా ఆధార్ నమోదు, మార్పులు, చేర్పులు చేసుకునే వారు సచివాలయాలను ఆశ్రయించాలన్నారు.

### 3 నుంచి ఫ్యామిలీ పింఛన్ల పరిశీలన

శిరివెళ్ల: ఫిబ్రవరి 3, 4 తేదీల్లో మండలంలోని ఫ్యామిలీ పింఛన్లను పరిశీలించనున్నట్లు ఎంపీడీఓ శివమల్లేశ్వరప్ప తెలిపారు. శనివారం ఆయన మాట్లాడుతూ 16 గ్రామ సచివాలయ పరిధిలో 56 పింఛన్లు ఉన్నాయని, పింఛన్‌దారులు నెల నెలా రూ.15 వేలు తీసుకుంటున్నారన్నారు. అనంతరపురానికి చెందిన ప్రత్యేక వైద్య బృందం పింఛన్ల పరిశీలన చేస్తారన్నారు. పరిశీలనలో పింఛన్‌దారులు ఆరోగ్యకరంగా ఉన్నట్లయితే వారి పింఛన్ రద్దు కావని వారిని రూ.4 వేల పింఛన్లకు మార్పు చేస్తారని తెలిపారు.

## ఇంజినీరింగ్ కళాశాలలుగా అప్‌గ్రేడ్ చేయాలి



మాట్లాడుతున్న నరసింహారావు

నంద్యాల(న్యూటౌన్): పాలిటెక్నిక్‌లను, ఇంజినీరింగ్ కళాశాలలుగా అప్‌గ్రేడ్ చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం పునః పరిశీలించాలని పాలిటెక్నిక్ రాష్ట్ర లెక్చరర్స్ అసోసియేషన్ జనరల్ సెక్రటరీ నరసింహారావు, ప్రెసిడెంట్ శరత్ అన్నారు. శనివారం పట్టణంలోని పాలిటెక్నిక్ కళాశాలలో పాలిటెక్నిక్ ఆల్ లెక్చరర్స్ అసోసియేషన్ (పీఏఎల్ఏ) స్టేట్ కౌన్సిల్ సమావేశం నిర్వహించారు. రాష్ట్ర నలుమూలల నుంచి పాలిటెక్నిక్ కళాశాలల లెక్చరర్లు సమావేశానికి హాజరయ్యారు. వారు మాట్లాడుతూ జీవో నెం.10 ప్రకారం 2016 యాక్టు వేతన బకాయిలను వెంటనే చెల్లించాలన్నారు. యాక్టు గెజిట్ ప్రకారం నిర్ణయించబడిన స్క్రీనింగ్ కమిటీ ద్వారా క్యాష్ ప్రక్రియను వేగవంతంగా చేపట్టాలని, సాంకేతిక విద్యను స్కిల్ డెవలప్‌మెంట్‌లో చేర్చారని, ఆరు పాలిటెక్నిక్ ఇంజినీరింగ్ కళాశాలలను అప్‌గ్రేడ్ చేయాలని కోరారు. ప్రతి ఏటా డిపార్టుమెంట్ ట్రాన్స్‌ఫార్స్‌ను పారదర్శకంగా చేపట్టాలని, ఖాళీగా ఉన్న ఫిజికల్ డైరెక్టర్, లైబ్రేరియన్ పోస్టులు మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. పాలిటెక్నిక్ కళాశాలల ఆధునీకరణ, ఖాళీగా ఉన్న అధ్యాపకులు, వర్క్‌షాప్ టెండర్స్, పోస్టులను కూడా మంజూరు చేయాలని తీర్మానించారు. పాలిటెక్నిక్ కళాశాల అసోసియేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు యుగంధర్, సుభాన్, సౌజన్య, కృష్ణయ్య, నరసింహరావు, మహేష్, నంద్యాల పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపాల్ శ్రీనివాసప్రసాద్ పాల్గొన్నారు.

## ప్రాణ రక్షణకు హెల్మెట్ తప్పనిసరి

– డీఎస్పీ ప్రమోద్ కుమార్


బైక్ ర్యాలీ నిర్వహిస్తున్న దృశ్యం

ఆళ్లగడ్డ: ప్రాణ రక్షణకు ద్విచక్రవాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని ఆళ్లగడ్డ డీఎస్పీ ప్రమోద్‌కుమార్ సూచించారు. జాతీయ రహదారి భద్రతా మాసోత్సవాల్లో భాగంగా శనివారం డీఎస్పీ కార్యాలయం ఆవరణ నుంచి నాలుగు రోడ్ల కూడలి మీదుగా పట్టణ పోలీస్ స్టేషన్‌వరకు బైక్ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా డీఎస్పీ మాట్లాడుతూ ద్విచక్ర వాహనదారులు ప్రతి ఒక్కరూ తన స్వీయ రక్షణతోపాటు, కుటుంబ క్షేమం కోసం హెల్మెట్ తప్పక ధరించాలన్నారు. కచ్చితంగా ట్రాఫిక్ – రోడ్డు భద్రత నియమాలు పాటిస్తూ ప్రమాదాల నివారణకు కృషి చేయాలన్నారు.

చాగలమర్రి: స్థానిక జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాలలో రోడ్డుభద్రతా వారోత్సవాలు ఘనంగా నిర్వహించారు. టోల్‌ప్లాజా సిబ్బంది పాల్గొని ప్రమాదాలకు గురైవారికి సీపీఆర్ ఎలా చేయాలో విద్యార్థులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో హెచ్‌ఎం ఐడీకే శాస్త్రి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## విద్యాప్రదాత పాండురంగారావు కన్నుమూత


పాండురంగారావు(ఫైల్)

నంద్యాల(వ్యవసాయం): పట్టణంలో శారదా విద్యానికేతన్ పాఠశాల నెలకొల్పి వేలాది మంది విద్యార్థులకు క్రమశిక్షణ, ఉత్తమ విద్యనందించిన ఏ.పాండురంగారావు శనివారం ఆయన నివాస గృహంలో మృతి చెందారు. కొంతకాలంగా క్యాన్సర్ వ్యాధితో బాధపడుతున్నారు. ఐదు దశాబ్దకాలం పాటు శారదా విద్యాపీఠం ప్రధానాచార్యులుగా, తదనంతరం 1984లో శారదా విద్యానికేతన్ పాఠశాల నెలకొల్పి నాలుగు దశాబ్దాల పాటు పాఠశాలను నిర్వహించారు. పట్టణ బ్రాహ్మణ సంఘం నాయకులు అప్పస్వామి నంద్యాల జిల్లా అధ్యక్షులు బిజ్జం సుబ్బారెడ్డి, కార్యదర్శి భాస్కర్, ఆర్‌జేయూపీ నాయకులు అన్నెం శ్రీనివాస రెడ్డి, శేషఫణి , పీఆర్‌టీయూ నాయకులు కృష్ణారావు, కరస్పాండెంట్లు బాలచంద్రుడు డీవీ సుబ్బయ్య, రవీంద్రనాథ్, దస్తగిరి, వెంకటేశ్వర్లు, తదితరులు కుటుంబ సభ్యులను పరామర్శించి ప్రగాఢ సానుభూతి తెలియజేశారు.

## జాతీయస్థాయి పోటీల్లో విద్యార్థి ప్రతిభ


మహమ్మద్ సాద్‌ను అభినందిస్తున్న దృశ్యం

నంద్యాల(న్యూటౌన్): నంద్యాల ఈఎస్సీ పాలిటెక్నిక్ కళాశాల విద్యార్థి మహమ్మద్ సాద్ నేషనల్ కర్లింగ్ చాంపియన్‌షిప్‌లో బంగారు, వెండి పతకాన్ని సాధించినట్లు ప్రిన్సిపాల్ శ్రీనివాస ప్రసాద్ తెలిపారు. శనివారం విద్యార్థిని ప్రిన్సిపాల్, కళాశాల హెచ్‌ఓడీలు అభినందించారు. వారు మాట్లాడుతూ కర్లింగ్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా జమ్మూ అండ్ కాశ్మీర్ అసోసియేషన్ నాల్గవ సబ్ జూనియర్ అండ్ సీనియర్ నేషనల్ కర్లింగ్ చాంపియన్‌షిప్‌ను ఈనెల 17 నుంచి 21వ తేదీ వరకు నిర్వహించారన్నారు. పాలిటెక్నిక్‌లో ఈసీఈ విభాగంలో ద్వితీయ సంవత్సరం చదువుతున్న బీఎస్ మహమ్మద్ సాద్ రాష్ట్రం తరపున పాల్గొని ఏపీటీం విభాగంలో బంగారు పతకం, డబుల్స్ విభాగంలో వెండి పతకం సాధించినట్లు తెలిపారు. ఫిజికల్ డైరెక్టర్ మార్గరేట్‌ను అభినందించారు.

## చట్టాలు అందరికీ సమానం


న్యాయవిజ్ఞాన పోస్టర్లను ఆవిష్కరిస్తున్న దృశ్యం

గోస్పాడు: చట్టాలు అందరికీ సమానంగా వర్తిస్తాయని ఆళ్లగడ్డ సీనియర్ న్యాయమూర్తి శైలజ అన్నారు. స్థానిక ఎంపీడీఓ సమావేశ భవనం ముందు శనివారం విధాన్ సే సమాధాన్ కార్యక్రమంలో భాగంగా మహిళలకు న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించారు. మండల న్యాయసేవా సంఘం ఆళ్లగడ్డ వారి ఆధ్వర్యంలో కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. అనంతరం కార్యక్రమానికి సంబంధించిన పోస్టర్లను విడుదల చేశారు. ఐసీడీఎస్ ఏసీడీపీఓ పద్మావతిదేవి, సీనియర్ న్యాయవాదులు రమాదేవి, విజయ్, ఈఓఆర్‌డీ నాగఅనసూయ, ఎస్ఐ వెంకటప్రసాద్ పాల్గొన్నారు.


ఉత్సాహంగా కబడ్డీ ఆడుతున్న బాలికలు

## హోరాహోరీగా క్రీడాపోటీలు

దొర్నిపాడు: గణతంత్ర దినోత్సవాన్ని పురస్కరించుకుని స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసని క్రీడాపోటీలు శనివారం హోరాహోరీగా సాగాయి. కబడ్డీ, ఖోఖో, టెన్నికాయిట్, వాలీబాల్ తదితర విభాగాల్లో బాలికలకు, బాలురకు వేర్వేరుగా నిర్వహించారు. విజేతలకు ఆదివారం గణతంత్ర దినోత్సవంలో బహుమతులను అందజేయనున్నట్లు ఫిజికల్ డైరెక్టర్ దేవేంద్ర తెలిపారు.

### పశువులకు వైద్యసేవలు

చాగలమర్రి: మండలంలోని ముత్యాలపాడు గ్రామంలో పశువుల ఆసుపత్రిలో వైద్యాధికారి సాయిబాబా ఆధ్వర్యంలో శనివారం ఏర్పాటు చేసిన వైద్య శిబిరంలో పశువులకు వైద్య సేవలు అందించారు. గర్భకోశ వ్యాధి పశువులు, పెద్ద పశువులు, దూడలు, జీవాలకు నట్టల నివారణ మందును తాపించారు.

### ఫిబ్రవరి నుంచి నెల వ్యవధి బస్ పాస్‌లు

నంద్యాల(వ్యవసాయం): నంద్యాల పరిసర ప్రాంత విద్యార్థులు బస్ పాస్‌లను సద్వినియోగం చేసుకోవాలని డిపో మేనేజర్ గంగాధర్ శనివారం తెలిపారు. ఆయన మాట్లాడుతూ 2024–25 విద్యాసంవత్సరానికి గాను కొన్ని కోర్సుల కాలవ్యవధి ముగుస్తున్నందున ఫిబ్రవరి నుంచి నెల వ్యవధి బస్సు పాస్‌లను ఇస్తామని తెలిపారు. వివరాలకు సెల్ : 9885845613 నంబర్‌లో సంప్రదించాలని కోరారు.

### ఎంఈఓ బాధ్యతల స్వీకరణ


ఎంఈఓను అభినందిస్తున్న దృశ్యం

రుద్రవరం: ఎంఈఓగా వీరరాఘవయ్య శనివారం బాధ్యతలు చేపట్టారు. కొంత కాలంగా మండల ఇన్‌చార్జ్ ఎంఈఓగా విధులు నిర్వహించిన కోటయ్యను ఉన్నతాధికారులు బదిలీ చేసి, ఆయన స్థానంలో ఆళ్లగడ్డ పట్టణంలోని ఎద్దుల పాపమ్మ ప్రభుత్వ పాఠశాల హెచ్‌ఎం వీరరాఘవయ్యను నూతన ఎంఈఓగా నియమించారు. దీంతో ఆయన బాధ్యతలు స్వీకరించారు. ఏపీ మోడల్ పాఠశాల ప్రిన్సిపాల్ సంగెపు నాగేశ్వరరావు, ఉపాధ్యాయ బృందం నూతన ఎంఈఓను శాలువా, పూలమాలతో సత్కరించి అభినందనలు తెలిపారు.

### విద్యారంగ సమస్యల పరిష్కారానికి పోరాటం

నంద్యాల(న్యూటౌన్): జిల్లాలో విద్యారంగ సమస్యల పరిష్కారానికి సమరశీల పోరాటాలు కొనసాగిస్తామని ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర అధ్యక్ష కార్యదర్శులు వలరాజు, బందెల నాసర్ పేర్కొన్నారు. శనివారం స్థానిక సాయిబాబానగర్‌లో సీపీఐ కార్యాలయంలో ఏఐఎస్ఎఫ్ జిల్లా స్థాయి సమావేశం నిర్వహించారు. అనంతరం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ సాంఘిక సంక్షేమ వసతి గృహాల్లో సమస్యలు విలయతాండవం చేస్తున్నాయన్నారు. వసతి గృహాలకు రెగ్యులర్ వార్డెన్లు లేక విద్యార్థులే వార్డెన్ల పాత్ర పోషిస్తున్నారన్నారు. కూటమి ప్రభుత్వం ఖాళీగా ఉన్న అధ్యాపక, వార్డెన్ పోస్టులను భర్తీ చేయాలని డిమాండ్ చేశారు. అనంతరం నంద్యాల జిల్లా నూతన కమిటీని ఎన్నుకున్నారు. జిల్లా అధ్యక్షుడిగా సురేష్, ప్రధాన కార్యదర్శిగా ప్రతాప్, జిల్లా సహాయ కార్యదర్శిగా ఎర్రిస్వామి, జిల్లా ఉపాధ్యక్షులుగా వినోద్, ఉదయ్‌లను ఎన్నుకున్నట్లు వివరించారు.

### రోడ్డు భద్రత నియమాలు పాటించాలి


మాట్లాడుతున్న ఐశ్వర్యారెడ్డి

నంద్యాల(న్యూటౌన్): విద్యార్థులు, తల్లిదండ్రులు రోడ్డు భద్రత నియమాలు పాటించాలని జిల్లా రవాణా శాఖ అధికారి ఐశ్వర్యారెడ్డి అన్నారు. శనివారం సాయంత్రం జాతీయ భద్రతా మాసోత్సవాల సందర్భంగా పట్టణంలోని శాంతినికేతన్ పాఠశాలలో అవగాహన సదస్సు నిర్వహించారు. పాఠశాల వాహన చోదకులు, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు. వాహనాలు నడుపుతున్నప్పుడు తీసుకోవాల్సిన జాగ్రత్తలు, రోడ్డు భద్రతా నియమాలను వివరించారు. కార్యక్రమంలో మోటారు వాహన తనిఖీ అధికారి శ్రీకాంత్, సీఐ మల్లికార్జున గుప్తా, పాఠశాల అధినేత సుధాకర్ పాల్గొన్నారు.

## హైకోర్టు ఉత్తర్వుల ఉల్లంఘన

● స్టేటస్ కో ఉన్నప్పటికీ షాదీఖానా నిర్మాణానికి మంత్రి ఫరూక్ శంకుస్థాపన


వివరాలు ప్రదర్శిస్తున్న మహబూబ్‌ఖాన్

నంద్యాల(అర్బన్): పట్టణంలోని సాయిబాబానగర్‌లో ఉన్న మజీద్‌ కుబ్రా, ఈద్గా కబరస్తాన్ డెవలప్‌మెంట్ సొసైటీకి సంబంధించిన కేసు కోర్టు వ్యాజ్యంలో ఉండగా హైకోర్టు ఇచ్చిన స్టేటస్‌కోను న్యాయ శాఖ మంత్రి ఫరూక్ ఉల్లంఘిస్తూ ఈనెల 24న షాదీఖానా నిర్మాణానికి శంకుస్థాపన చేశారని, ఈ చర్య కోర్టు ఉత్తర్వులను ఉల్లంఘించడమేనని ఈద్గా కబరస్తాన్ డెవలప్‌మెంట్ సొసైటీ అధ్యక్షుడు మహబూబ్‌ఖాన్ పేర్కొన్నారు. స్థానిక సొసైటీ ఆవరణలో శనివారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ 2001లో ఈద్గా, సొసైటీ కార్యక్రమాలు ప్రారంభమయ్యాయన్నారు. అప్పటి అసోసియేషన్ అధ్యక్షుడు అంజాద్‌బాషా సిద్దిఖీ చేస్తున్న ఆగడాలను సభ్యులు అప్పట్లో ఎన్ఎండీ ఫరూక్‌కు తెలిపి అంజాద్‌బాషా సిద్దిఖీ, కరీముల్లాలను సొసైటీ నుంచి తొలగించారన్నారు. వారిద్దరూ మరో అసోసియేషన్ ఏర్పాటు చేసుకుని కార్యకలాపాలు నిర్వహిస్తున్నారన్నారు. ఈ విషయంపై హైకోర్టును ఆశ్రయించగా 2023లో హైకోర్టు స్టేటస్‌కో ఇచ్చిందని చెప్పారు. అయినా 2024లో సొసైటీ సభ్యులపై అక్రమ కేసులు నమోదు చేయించి 8 కుటుంబాలను ఆర్థికంగా ఇబ్బందులకు గురి చేశారన్నారు. అసోసియేషన్ కార్యాలయ తాళాలను పగలగొట్టి డాక్యుమెంట్లు, నగదును తీసుకెళ్లారని ఆరోపించారు. ఈనెల 24న మైనార్టీ, న్యాయ శాఖ మంత్రి ఫరూక్ షాదీఖానాను తొలగించి ఆ స్థానంలో మరో నూతన షాదీఖానా నిర్మాణానికి శంకుస్థాపన చేశారన్నారు. న్యాయ శాఖ మంత్రిగా ఉన్న ఫరూక్ హైకోర్టు ఉత్తర్వులను ఉల్లంఘించడం ఎంతవరకు సమర్థనీయమని ప్రశ్నించారు. ఈ విషయంపై న్యాయస్థానాన్ని ఆశ్రయిస్తామని చెప్పారు.

## నిందితులను కఠినంగా శిక్షించాలి


ఉయ్యాలవాడలో నిరసన వ్యక్తం చేస్తున్న ఉపాధి ఏపీఓ, సిబ్బంది


రుద్రవరంలో నల్ల బ్యాడ్జీలతో నిరసన తెలుపుతున్న ఉపాధి సిబ్బంది

ఉయ్యాలవాడ: ఆలూరు మండలం అరికెర గ్రామానికి చెందిన ఉపాధి హామీ పథకం ఫీల్డ్ అసిస్టెంట్ కురువ ఈరన్నను హత్య చేసిన నిందితులను కఠినంగా శిక్షించాలని ఏపీఓ రవిప్రకాష్ డిమాండ్ చేశారు. శనివారం స్థానిక మండల పరిషత్ కార్యాలయం ఎదుట ఏపీఓ, ఉపాధి సిబ్బంది, ఫీల్డ్ అసిస్టెంట్లు నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా ఏపీఓ మాట్లాడుతూ ఫీల్డ్ అసిస్టెంట్లను బెదిరింపులకు గురి చేయడం, దాడులు చేయడం, హత్యలు చేయడం ప్రజాస్వామ్యంలో సరికాదన్నారు.

రుద్రవరం: అరికెర ఫీల్డ్ అసిస్టెంట్ హత్యను నిరసిస్తూ రుద్రవరం మండల ఉపాధి హామీ ఉద్యోగులు శనివారం నల్ల బ్యాడ్జీలు ధరించి మండల పరిషత్ కార్యాలయ ప్రాంగణంలోని గాంధీ విగ్రహం ఎదుట అందోళనకు దిగారు. ఏపీఓ ప్రతాప్ మాట్లాడుతూ గ్రామాల్లో ఫీల్డ్ అసిస్టెంట్లపై దాడులు చేయడం తగదన్నారు. ఇలాంటివి పునరావృతం కాకుండా అధికారులు నిందితులపై కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు.

**ఫీల్డ్ అసిస్టెంట్ హత్య దారుణం**


గోస్పాడులో నల్ల రిబ్బన్లు ధరించి నిరసన తెలుపుతున్న ఉపాధి సిబ్బంది

గోస్పాడు: ఆలూరు మండలం అరికెర గ్రామ ఫీల్డ్ అసిస్టెంట్ కురువ ఈరన్నను హత్య చేయడం దారుణమని ఉపాధి హామీ పథకం సిబ్బంది, జిల్లా టెక్నికల్ అసిస్టెంట్ వెల్ఫేర్ అసోసియేషన్ జనరల్ సెక్రటరీ కొర్నేలు అన్నారు. శనివారం స్థానిక మండల పరిషత్ కార్యాలయం ఎదుట నల్లబ్యాడ్జీలు ధరించి నిరసన కార్యక్రమం నిర్వహించారు. అనంతరం ఈఓపీఆర్‌డీ నాగఅనసూయకు వినతి పత్రం అందజేశారు. ఆయన మాట్లాడుతూ పేదలకు ఉపాధి పనులు చూపించే చిరుస్థాయి ఉద్యోగిని దారుణంగా హత్య చేయడం ఎంత వరకు సమంజసమని ప్రశ్నించారు. ఎన్ఆర్ఈజీఎస్ మండల జేఈ ఉమామహేశ్వర్, ఫీల్డ్ అసిస్టెంట్ బాలన్న, నాగేంద్ర, శ్రీనివాసులు పాల్గొన్నారు.

## మోడల్ క్లస్టర్లను తొలగించాలి

నంద్యాల(న్యూటౌన్): జిల్లాలో నూతనంగా మోడల్ స్కూళ్లను క్లస్టర్‌గా ఏర్పాటు చేశారని, వాటిని విరమించుకోవాలని పీఆర్‌టీయూ నంద్యాల జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు రామపక్కీర్‌రెడ్డి, సయ్యద్‌చాంద్‌బాషా, వర్కింగ్ ప్రెసిడెంట్ భాస్కరరెడ్డి కోరారు. ఈమేరకు శనివారం డీఈఓ జనార్దన్‌రెడ్డికి పలు డిమాండ్లతో కూడిన వినతి పత్రాన్ని అందజేశారు. వారు మాట్లాడుతూ రాబోయే రోజుల్లో క్లస్టర్ హెడ్స్ వారి పరిధిలోని పాఠశాలల బాధ్యతలు చూడాల్సిన అవసరం ఏర్పడుతుందన్నారు. మోడల్ స్కూల్‌లో పని చేసే ఉపాధ్యాయులకు ఎలాంటి సర్వీస్ రూల్స్ లేవన్నారు. ప్రభుత్వం స్పందించి సమస్యలు దృష్టిలో ఉంచుకొని మోడల్ స్కూల్ క్లస్టర్లను తొలగించి జిల్లా పరిషత్, ప్రభుత్వ ఉన్నత పాఠశాలలోనే క్లస్టర్‌గా చేయాలని కోరారు. అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు విజయరావు, పాణ్యం మండల అధ్యక్షుడు మాధవరెడ్డి, హబీబ్‌బాషా పాల్గొన్నారు.

## కేఆర్ఎంబీ బోర్డును కర్నూలులోనే ఏర్పాటు చేయాలి


ఆర్ఐకి వినతిపత్రం అందజేస్తున్న మార్కెట్‌యార్డ్ మాజీ డైరెక్టర్, రైతులు

ఉయ్యాలవాడ: కృష్ణా నది యాజమాన్య బోర్డు కార్యాలయాన్ని కర్నూలులోనే ఏర్పాటు చేయాలని ఆళ్లగడ్డ మార్కెట్ యార్డ్ మాజీ డైరెక్టర్, వైఎస్సార్ సీపీ మండల నాయకులు గజ్జెల క్రిష్ణారెడ్డి శనివారం ఆర్ఐ అంకన్నను రైతులతో కలిసి వినతి పత్రం అందజేశారు. రాష్ట్ర విభజన చట్టం 2014 ప్రకారం తెలుగు రాష్ట్రాలకు కృష్ణానది నీటి నిర్వహణ చేయడానికి కృష్ణా జలాలు వినియోగంపై విధానాలు పరిష్కరించడానికి కృష్ణా నది యాజమాన్యం బోర్డును కేంద్ర ప్రభుత్వం ఏర్పాటు చేసిందన్నారు. ఈ బోర్డు ప్రధాన కేంద్రం ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో ఏర్పాటు చేయాలన్న నిబంధనను కూడా విభజన చట్టంలో పొందుపరచిందని ఆయన గుర్తుచేశారు.

### ఫీల్డ్ అసిస్టెంట్ల రాజీనామా

శిరివెళ్ల: మండలంలో ఏడుగురు ఫీల్డ్ అసిస్టెంట్లు రాజీనామా చేశారని ఎంపీడీఓ శివమల్లేశ్వరప్ప శనివారం తెలిపారు. గంగవరం, బోయలకుంట్ల, చెన్నూరు, గోవిందపల్లె, కోటపాడు, గుంప్రమాన్‌దిన్నె, యర్రగుంట్ల గ్రామాల ఫీల్డ్ అసిస్టెంట్లు స్వచ్ఛందంగా రాజీనామా చేశారన్నారు. ప్రస్తుతం ఉపాధి పథకం సామాజిక తనిఖీ జరుగుతుందని, ఈనెల 30న ప్రజా వేదిక చర్చ ఉంటుందని తెలిపారు.

### పిచ్చిమొక్కల తొలగింపు

దొర్నిపాడు: చాకరాజువేముల గ్రామంలోని ప్రాథమిక పాఠశాల (మెయిన్) ఆవరణలో మొలిచిన పిచ్చిమొక్కలను శనివారం తొలగించారు. పూర్వ విద్యార్థులు కోనయ్యగారి శ్రీను, హుసేన్‌వలి, అబ్దుల్ కలాం, జాకీర్ హుసేన్, మోహన్‌రాజు, మనోహర్, తిరుపతయ్య, మధు, అశోక్, నరసింహుడు, కిట్టు, సుభాన్, వెంకట సిసింద్రి, వీఆర్ఏ నరసింహుడు ముళ్ల పొదలను తొలగించారు.